

అలరించిన నృత్యార్చన



నృత్యం చేస్తున్న కళాకారిణులు

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం సంస్కృతి ఆర్ట్ అకాడమీ గురువు తిరిగొప్పుల శ్వేత శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శిరుత నవ్వులవాడు, ఇందరికి అభయంబు, బ్రహ్మమొక్కటే, అన్ని మంత్రాలను, సంకీర్తనలకు నృత్యాన్ని ప్రదర్శించి అలరించారు. కళాకారులు ధృతి, సాన్వీ, మొక్ష, చకృతి, కీర్తన, సహస్ర, జాహ్నవి,హాయతి, వైష్ణవి, అక్షయాణి, రిషిగా, మనస్విని, అశ్విని, నక్షత్ర, భవిష్యా, నయిని, హాసిని, సాయిమనన్విత, సమీరా, అన్విత తమ నాట్యాలతో ప్రేక్షకులను మైమరిపించారు.

శిల్పారామంలో..

మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం శ్రీదేవి రాజనాల శిష్య బృందం, మయూరి నృత్యాలయ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలను ప్రదర్శించి అలరించారు. భామా ప్రవేశం, రుక్మిణీ ప్రవేశం, కొలువైతివా రంగసాయి, గణేశ పంచరత్న, అతినిరుపమా, బృందావన నిలయే, సంగీత సామ్రాజ్య తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి అలరించారు.

లలితా కళా అకాడమీ ఏర్పాటుకు కృషి

మంత్రి జూపల్లి కృష్ణారావు



మాదాపూర్: కళలు, కళాకారులకు హద్దులు లేవని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన 5 జాతీయ చిత్ర కళ పోటీలు, ప్రదర్శన కార్యక్రమంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ స్థాయిలో పేరొందిన చిత్రకారులు గీసిన చిత్రాలు, వారిలో ఉన్న నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి నిర్వహించే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. లలిత కళా అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. విభిన్న కళారీతులను అనుసరిస్తూ దేశవ్యాప్తంగా పేరొందిన వందలాదిమంది చిత్రకారులు ఈ పోటీల్లో పాల్గొన్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రొఫెసర్ ఆనంద్ గడప్ప పాల్గొన్నారు.

ఆటోల్లో సేఫ్‌గా ప్రయాణించండి



మై ఆటో సేఫ్ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది



మాట్లాడుతున్న ఎస్‌ఐ ఆంజనేయులు

సీఐ గంగాధర్

జిన్నారం(పటాన్‌చెరు): పోలీస్ స్టిక్కర్లు ఉన్న ఆటోల్లోనే ప్రజలు సేఫ్‌గా ప్రయాణించాలని బొల్లారం సీఐ గంగాధర్ అన్నారు. మండల పరిధిలోని బొల్లారం, గడ్డపోతారం గ్రామాల్లో మై ఆటో సేఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలకు స్టిక్కర్లు వేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిన్నారం మండల కేంద్రంలో..

ఎస్‌ఐ విజయారావు ఆధ్వర్యంలో మైఆటో సేఫ్ కార్యక్రమాన్ని జిన్నారం మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలకు పోలీసులు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలకు స్టిక్కర్లు తప్పనిసరి అతికించాలి

పటాన్‌చెరు: ఆటోలకు 'మై ఆటో ఇస్ సేఫ్' స్టిక్కర్లు తప్పనిసరిగా అతికించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఆటోడ్రైవర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మై ఆటో ఇస్ సేఫ్' స్టిక్కర్ల ద్వారా ప్రయాణికులకు ఆటో ప్రయాణంపై నమ్మకం కలగడంతో పాటు అపత్కాల సమయంలో పోలీసుల సహాయం త్వరగా అందుతుందన్నారు. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీసులు,ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. నిత్యం చింత!

- రాకపోకలకు ఇబ్బందులు
- మరమ్మతులు చేయాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అధ్వానంగా అంతర్గత రహదారులు



జనప్రియ వెస్ట్‌సిటీ కాలనీలో గుంతలమయమైన రోడ్డు



మియాపూర్: కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఒక సమస్యను పరిష్కరించబోయి మరో సమస్యను తెచ్చిపెట్టారని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారినప్పటి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

చిన్న పాటి వర్షానికే గుంతలు..

మియాపూర్‌లోని జనప్రియ వెస్ట్‌సిటీలో రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు పడితే పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుందని, రోడ్లన్ని బురదమయంగా మారే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందనే చందంగా పరిస్థితి మారిందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఎక్కడపడితే అక్కడ అవసరమున్నా లేకున్నా... రోడ్లను ఇష్టానుసారంగా తవ్వి వదిలేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రోడ్లను తవ్వి పైపులైన్ పనులు నిర్వహించి మరమ్మత్తులు చేయకుండా రోజుల తరబడి అలాగే వదిలేశారు.

ఇష్టానుసారంగా తవ్వకాలు..

రోడ్డును మధ్యలో తవ్వి పనులు చేపట్టి ఆ గుంతలలో మట్టిని పూడ్చి చేతులు దులుపుకున్నారు. తవ్విన ప్రాంతంలో మరమ్మతులు కానీ, సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టకపోవడంతో గుంతలు దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమైంది. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డును తవ్విన ప్రాంతంలో మట్టి కొట్టుకుపోయి గుంతలమయంగా మారాయి. వరద నీటిలో ఎక్కడ గుంతుందో కనిపించక వాహనాదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడే అవకాశముందని భయాందోళన చెందుతున్నారు. కాలనీలో అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. భారీ వర్షాలు పడితే గుంతల్లో మట్టి పూర్తిగా కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలు పడే అవకాశముందని త్వరగా అధికారులు స్పందించి సీసీ రోడ్డు పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..



కాలనీలో డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తిచేసి రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు తవ్విన ప్రాంతంలో రోడ్లకు మరమ్మతులు కానీ, సీసీ రోడ్డు కానీ వేయలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో ఉన్న మట్టి కొట్టుకుపోయి రోడ్డు గుంతలమయంగా మారింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు పనులను పూర్తి చేయాలి.

– శివకుమార్, స్థానికుడు

లార్డ్స్ కళాశాలలో హ్యాక్‌ప్రిక్స్ షురూ



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్‌లో గల లార్డ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో హ్యాక్‌ప్రిక్స్ -2024 శనివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పాల్గొనే వారు తమ ప్రాజెక్ట్‌ను పిచ్ చేసేందుకు, వారి ఆలోచనలను సహచరులకు, స్పాన్సర్ ప్రతినిధులకు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే విజేతలకు భారీగా నగదు బహుమతి అందిస్తామన్నారు. 80కి పైగా నగరాల నుంచి సుమారు 550 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని కళాశాల జనరల్ సెక్రటరీ తన్వీర్ తెలిపారు. విద్యార్థులు, ఫ్యాకల్టీల విజన్, హ్యాక్‌ప్రిక్స్‌ను రియాలిటీగా మార్చిందన్నారు. 36 గంటల లాంగ్ హ్యాక్‌థాన్‌కు తెలంగాణ రాష్ట్రంలో 1300 కంటే ఎక్కువ రిజిస్ట్రేషన్లు పొందిందని పేర్కొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవుల శివారులోని శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలాస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం ధ్వజారోహణం, బలిహరణం, హారతి, ప్రసాద గోష్టి నిర్వహించారు. సాయంత్రం భేరి పూజ, దేవతాహ్వానం, హనుమంత వాహన సేవలు చేపట్టారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: ఫుట్‌పాత్ వ్యాపారాలతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఆక్రమణలను శనివారం గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆక్రమణలు కూల్చివేశారు. రోడ్డు వెంట వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే సహించేది లేదని టీఎస్‌ఐఐసీ అధికారులు హెచ్చరించారు. నానక్‌రాగూడ బైపాస్ రోడ్డులో కొద్ది రోజులుగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకొని తోపుడు బండ్లు, గుడిసెలు, డబ్బాలు వేసుకొని చిరు వ్యాపారులు తిష్ట వేశారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి గచ్చిబౌలి, ఖాజాగూడ వైపు నిత్యం వేల సంఖ్యలో ఐటీ ఉద్యోగులు వెళ్తుంటారు. వీధి వ్యాపారుల కారణంగా షాపుల ముందు కస్టమర్లు బైక్‌లు ఆపడం, అక్కడే తినడంతో ట్రాఫిక్ జామ్ నెలకొంటోంది. పతి రోజు సాయంత్రం సమయంలో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఫుట్‌పాత్ వ్యాపారుల కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు టీఎస్‌ఐఐసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆక్రమణలను తొలగించారు.

మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు



మూతలేని మ్యాన్‌హోల్

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతు తర్వాత ఇలా..

రాయదుర్గం: రాయదుర్గంలోని ఎస్సీకాలనీలో మ్యాన్‌హోల్‌పై మూత లేకపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, పాదచారులు భయంభయంగా రాకపోకలు సాగించేవారు. వర్షం కురిస్తే మ్యాన్‌హోల్ కనబడక ప్రమాదాలు సైతం జరిగేవి. ఈ సమస్యపై ఈ నెల 8న సాక్షిలో 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. ధ్వంసమైన మ్యాన్‌హోల్ మూతను మార్చి కొత్తది ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

గ్రూపు-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరీక్షల నిర్వాహణాధికారి ఎర్ర అంజయ్య, పోలీసులు

రాజేంద్రనగర్: నేడు జరగనున్న తెలంగాణ రాష్ట్ర గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల నిర్వాహణాధికారి ఎర్ర అంజయ్య తెలిపారు. శనివారం కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 9 నుంచే పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తామని హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. 10 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని, అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, షూస్, చేతి గడియారం ధరించవద్దన్నారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి, లేకుంటే వారి ఫలితాలను నిలిపివేయనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించిందని తెలిపారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 312 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరీక్షల పరిశీలకులు వేణుగోపాల్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ హరిప్రియ, స్పెషల్ ఇన్విజిలేటర్లు మాన్య, స్వప్న, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ రావు, ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు కూడా పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

మణికొండ: ప్రస్తుత పరిస్థితిల్లో ప్రతిఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట నాలుగో వార్డు కౌన్సిలర్ ఎ. దుర్గేశ్‌యాదవ్ అన్నారు. తన వార్డు పరిధిలోని పోచమ్మ బస్తీలో న్యూ ఇరా డయాగ్నోస్టిక్ వారు శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వైద్యుల సలహాల ప్రకారం మందులు వాడడంతో పాటు ఆహార అలవాట్లలో మార్పు చేసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు.

చెరువు.. కలుషితానికి నెలవు!

- మురుగుమయంగా గోపన్‌పల్లి-గోపన్‌పల్లి తండా చిన్నపెద్ద చెరువు
- చేపలు పెంచుతున్నాం.. ఇదే మా జీవనోపాధి
- మత్స్యకారుల ఆవేదన



గోపన్‌పల్లి-గోపన్‌పల్లితండా మధ్యన ఉన్న చిన్నపెద్దచెరువులో మురుగునీరు కలిసిన దృశ్యం

రాయదుర్గం: గోపన్‌పల్లి-గోపన్‌పల్లి తండా మధ్యన ఉన్న చిన్నపెద్ద చెరువు కలుషితమయింది. నిత్యం ఈ చెరువులోకి మురుగునీరు వచ్చి చేరుతుండడంతో కలుషితమయింది. చెరువు చుట్టూరా ఉన్న భవనాల నుంచి డ్రైనేజీ పైప్‌లైన్ ద్వారా చెరువులో చేరుతోంది. ఫిర్యాదులు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

మత్స్యకారుల ఆందోళన..

- చెరువునీటి కలుషితం పట్ల మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారంతా పేద, మధ్య తరగతి వారు కావడంతో చేపల పెంపకం, విక్రయాలే వారి జీవనోపాధిగా మారింది.
- కానీ చెరువునీరు కలుషితం అవుతుండడంతో చాలా మంది చేపలు కొనడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- చెరువునీరు కలుషితం కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
- ఎస్టీపీ నిర్మించినా చెరువులోకి మురుగునీరు వెళ్లేలా ఏర్పాట్లు చేయడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

చెరువు ఆనుకుని ఎస్టీపీ నిర్మించినా ఫలితం శూన్యం..

- ఈ చెరువు చెంతనే సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. మురుగునీటిని ఎస్టీపీలోకి వెళ్లే పైప్‌లైన్‌తో అనుసంధానం చేస్తే సమస్య ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు.
- గోపన్‌పల్లి, గోపన్‌పల్లి తండా చుట్టూరా ఉండే ప్రాంతంలో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, కొత్తగా వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం పెద్ద ఎత్తున సాగింది.
- చెరువు నుంచి వచ్చే దుర్వాసనతో ఇక్కట్లు పడుతున్నామని వాపోతున్నారు.
- ప్రస్తుతం ఈ చెరువు వద్ద విశాలమైన స్థలం ఉండడంతో ఈ చెరువును పార్కులా సుందరీకరించి వాకింగ్, సైకిల్‌ట్రాక్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



తాత్కాలికంగా వేసిన పైపుల ద్వారా చెరువులోకి చేరుతున్న మురుగు

పాలపిట్ట పార్కు వేళలు..

రాయదుర్గం: కొత్తగూడలోని తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే పాలపిట్ట సైక్లింగ్ పార్కులో ఆహ్లాద పూరిత వాతావరణంలో సైకిల్ నడిపే అవకాశం.

పని వేళలు..

- ఉదయం 5.30 గంటల నుంచి 10 గంటల వరకు
- సాయంత్రం 3.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు

సైకిళ్ల అద్దె వివరాలు..

- అడల్ట్స్/కిడ్స్-గంటకు రూ.59
- సొంత సైకిల్ తీసుకొస్తే నాలుగు గంటలకు రూ.59
- నెలవారీ పాస్ రూ.900

గ్రూప్-1 కోసం ప్రత్యేక బస్సులు

రాయదుర్గం: నగరంలో నిర్వహించే గ్రూప్-1 అభ్యర్థుల కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులను నడుపుతోందని గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మర్యాద మురళీధర్‌రెడ్డి శనివారం తెలిపారు. హెచ్‌సీయూ డిపో ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి లింగంపల్లి, పటాన్‌చెరు బస్టాండ్ల నుంచి పరీక్ష కేంద్రాల రూట్లో ఈ ప్రత్యేక బస్సులను స్పెషల్ బోర్డులతో నడపడం జరుగుతుందన్నారు. రోజువారీగా నడిచే బస్సులతో పాటు ఈ అదనపు బస్సుల ను కూడా నడపాలని ఆర్టీసీ సంస్థ నిర్ణయించిందని పరీక్ష రాసే వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

15న శాంతి సరోవర్‌లో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 15న పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ప్రత్యేక సెమినార్ నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే కార్యక్రమంలో 'ప్రాస్పరిటీ ఇన్ బిజినెస్ త్రూ ట్రెజర్స్ ఆఫ్ బ్లెస్సింగ్స్' అనే అంశంపై మౌంట్‌అబూకు చెందిన బి.కె.ఉషాదీదీ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. ఇదే కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ హైదరాబాద్ డైరెక్టర్ బి.కె.కులదీప్ దీదీ, అరబిందో ఫార్మా లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హెచ్‌ఆర్ డాక్టర్ యూఎస్‌బీ రాజు, డ్యూక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రవీందర్ అగర్వాల్, టీహెచ్‌సీఎంఏ అజయ్‌కుమార్ అగర్వాల్ పాల్గొంటారు. మరిన్ని వివరాలకు 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

అవగాహనతోనే 'ట్యూమర్'పై విజయం



సాక్షి,సిటీబ్యూరో: మెదడు కణితులతో పోరాటంలో వ్యాధిపై అవగాహనే విజయానికి తొలి మెట్టు అని టాలీవుడ్ నటి డాక్టర్ రూప కొడువాయుర్ అన్నారు. హైటెక్‌సిటీలోని కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే సందర్భంగా వ్యాధిపై పోరాటంలో విజయం సాధించిన సర్వైవర్స్‌తో శనివారం అవగాహన వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తగిన అవగాహనతో ప్రారంభ దశలోనే రోగ నిర్ధారణ చేసి సరైన చికిత్స అందిస్తే వ్యాధిపై విజయం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి డాక్టర్ రజత్ కుమార్, కేర్ హాస్పిటల్స్, హెచ్ సీఓఓ సునీత్ అగర్వాల్ పాల్గొన్నారు.

మేళ్ల చెరువు పరిసరాలు శుభ్రం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు పరిసరాలను తెల్లాపూర్ నైబర్‌హుడ్ గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో శనివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే గ్రీన్‌ఆర్మీను ఏర్పాటు చేసి అందరం కలిసికట్టుగా చెరువుల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆదివారం ఒక చెరువును ఎంపిక చేసుకొని పరిసరాలను శుభ్రం చేస్తున్నట్లు వివరించారు.

ఖాజీపల్లి గ్రామంలో చోరీ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు మోహన్‌రెడ్డి ఖాజీపల్లిలోని 181 సర్వే నంబర్‌లోని కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మోహన్‌రెడ్డి గురువారం సొంత గ్రామమైన కామారెడ్డికి వెళ్లగా ఆయన భార్య పక్కనే ఉన్న బంధుల ఇంట్లో నిద్రించింది. శనివారం ఉదయం ఇంటికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.80వేల నగదు, ఇతర వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు బోరున విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. డివిజన్‌పరిధిలోని 6, 7బ్లాక్‌లలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు బస్తీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వీధిదీపాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ను కోరగా పై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఆమె వెంట స్థానిక నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

వరద కాలువలను సంరక్షించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వరద కాలువల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెల్లాపూర్ నీటి సంఘం మాజీ చైర్మన్ వడ్డే నరసింహ కోరారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వర్షాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు వెంటనే వరద కాలువలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. చెరువు కాలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గురు, శుక్రవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మందిని అదుపులోకి తీసుకొని శనివారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చారు. దీంతో జడ్జి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.